శరవేగంగా 50 పడకల ఆస్పత్రి నిర్మాణం

- రూ.3.50 కోట్లతో నిర్మాణ పనులు
- రోగులకు అందనున్న మెరుగైన వైద్య సేవలు
- మంత్రి ఉషశ్రీచరణ్ ప్రత్యేక చొరవ


నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆస్పత్రి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కంబదూరు తదితర ప్రాంతాల నుంచి రోజుకు వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. మరింత మెరుగైన వైద్య సేవలకు కావాలంటే అనంతపురం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగులు వెళ్లాల్సి వచ్చేది. ఇక రోగులకు ఇలాంటి ప్రయాస అవసరం లేకుండా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ చొరవతో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం కళ్యాణదుర్గంలో నిర్మితమవుతోంది.

రూ.3.50 కోట్లతో నిర్మాణ పనులు

కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో ఇప్పటివరకు 30 పడకలతోనే పేదలకు వైద్యం అందుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు 30 పడకల నుంచి రూ.50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు మంత్రి చొరవ చూపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.3.50 కోట్ల నిధులను తీసుకువచ్చి పాత సీహెచ్‌సీ సమీపంలో అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టారు. ఇప్పటికే భవనం నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. 50 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు అనంతపురం, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాస తగ్గుతుంది.


ఓపీ కోసం రోగుల క్యూ..

వందల సంఖ్యలో రోగులకు చికిత్సలు

నియోజకవర్గం నుంచి రోజూ రోగులు వివిధ జబ్బులతో కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి వస్తుంటారు. రోజుకు 350 నుంచి 400 వరకు ఓపీ నమోదు అవుతోందంటే ఏ స్థాయిలో చికిత్సలు అందుతున్నాయో అర్థమవుతుంది. ఇటీవల ప్రభుత్వం అన్ని విభాగాలకు డాక్టర్లను నియమించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో 8 మంది వైద్యులు నిత్య పర్యవేక్షణలో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఈఎన్‌టీ వైద్యుడిని కూడా ప్రభుత్వం త్వరలో నియమించనుంది. ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో గర్భిణులు, చిన్నపిల్లలు తల్లులు, వృద్ధులు సైతం అధికంగా ప్రభుత్వాస్పత్రికి తరలి వస్తున్నారు. ఇక 50 పడకలు ఆసుపత్రి ఏర్పాటైతే మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి నెలా వైద్య పరీక్ష చేయించుకుంటున్నా



నేను ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాను. నెలా నెలా పరీక్షలు చేయించుకుంటున్నాను. గతంలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు ఇప్పుడు ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం కోసం వస్తున్నారు. డాక్టర్లు బాగా చూస్తున్నారు.

– బాలా అనిత, గర్భిణి, కళ్యాణదుర్గం

మారుతీ.. మంత్రిని విమర్శించే స్థాయి లేదు


కళ్యాణదుర్గం: విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కుందుర్పి: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


శెట్టూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం/కుందుర్పి/శెట్టూరు: 'తండ్రి (మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి) అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడిన నువ్వా మంత్రిని విమర్శించేది. నీకు ఆ స్థాయి లేదు' అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ నాయకుడు మారుతీ చౌదరిపై విరుచుకుపడ్డారు. ఇటీవల మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌పై టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, అర్బన్, రూరల్ సచివాలయాల కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, సీనియర్ నాయకుడు సుధీర్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో అవినీతి, అక్రమాలు, దాడులు మరిచిపోయావా అంటూ ప్రశ్నించారు. ఇసుక రవాణా, గాలిమరల కంపెనీల్లో రూ.వందల కోట్లు అక్రమాలకు పాల్పడింది మీరు కాదా...అంటూ నిలదీశారు. గత టీడీపీ హయాంలో 2014కు ముందు మీ ఆస్తులెంత....అధికారంలోకి వచ్చాక 2019 వరకూ రూ.వందల కోట్లు అక్రమంగా కూడబెట్టుకున్నారో ఆధారాల సహా బయటపెడతామన్నారు. పేదలకు చెందిన చర్చి స్థలాన్ని కబ్జా చేసి కాంప్లెక్స్‌లు నిర్మించుకున్నది వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. టీడీపీ హయాంలో సుబేదారు చెరువు ఆక్రమణలు చేసి...వాటాలు పంచుకుని నిందలు మంత్రిపై వేయడం తగదన్నారు. నాయకులు నరేంద్రరెడ్డి, తిరుమల వెంకటేశులు, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, కౌన్సిలర్లు అబ్రహాం, లక్ష్మన్న, కో ఆప్షన్ సభ్యుడు అప్జల్, ఉమాపతి, హేమ, రాము, హబీబ్, జోసెఫ్ కిశోర్, ఆంజినేయులు, మంజు, రమేష్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

- కుందుర్పిలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరు సమావేశం నిర్వహించి ఉన్నం కుమారుల అవినీతి, భూఆక్రమణలపై మండిపడ్డారు. ప్రజాశ్రేయస్సే పరమావధిగా మంత్రి ఉషశ్రీచరణ్ నియోజక వర్గంలో పాలన సాగిస్తుంటే.. ఉన్నం కుమారుడు మారుతీ చౌదరి మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ బీజప్ప, సచివాలయ మండల కన్వీనర్ ఈ.రాము, డీలర్ల సంఘం నాయకులు గోపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.
- శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయ ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీమండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. 'మీ నాన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీరు చేసిన దౌర్జన్యాలు, అవినీతి వల్లే కదా మీ నాయకుడు చంద్రబాబు మిమ్మల్ని దూరం పెట్టింది. మరుగుదొడ్ల బిల్లులు సైతం స్వాహా చేశారు. 2024లో టిక్కెట్ కోసమే మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారు. మీరు ఎంత గొంతుచించుకొన్న మీకు టిక్కెట్ రాదు' అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, నాయకులు వీరభద్ర, రామాంజినేయులు, డీలర్లు వన్నూరప్ప, మహ్మమ్మద్ రఫీ, పీఎల్ తిప్పేస్వామి, గ్రామ సచివాలయ కన్వీనర్లు బోయ నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం


ఉరవకొండ: మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ ప్రజాప్రతినిధులు


వజ్రకరూరు: వీపీపీ తండాలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. గుంతకల్లులో జరుగుతున్న మాజీ ఎమ్మెల్యే వై.భీమ్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న మంత్రికి మాజీ ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి, ఉరవకొండ, విడపనకల్లు జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, హనమంతు, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, అధికారప్రతినిధి వీరన్న పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

వజ్రకరూరు: ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాంపల్లిపెద్దతండా(రూపానాయక్‌తండా)లో జెడ్పీటీసీ నిధులు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఆయన ప్రారంభించారు. మోటార్ ఆన్‌చేసి ప్రజలకు తాగునీరు అందించారు. అనంతరం 'నాడు–నేడు' నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పాటు 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నారన్నారు. అనంతరం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఎంపీపీ రమావత్‌దేవి, స్థానిక సర్పంచు కొర్రా శివాజీనాయక్, వైస్ ఎంపీపీ సుంకమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, కమలమ్మ, మల్లెల జగదీష్, సురేంద్ర, కవితాభాయి, స్థానిక నాయకులు గోబ్రియానాయక్, డీలర్ గోపాల్ నాయక్ ,బీకా నాయక్, వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ చంద్రమౌళి, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు కాలువ సమస్యకు పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు వద్ద 12వ డిస్ట్రిబ్యూటర్ పరిధిలో ఏర్పడ్డ పిల్ల కాలువ సమస్యకు డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్ పరిష్కార మార్గం చూపారు. సర్పంచ్ హెచ్ కవిత, ఆర్‌ఐ చంద్రశేఖర్, జెడ్పీ మాజీ సభ్యుడు హెచ్ వన్నప్ప, వీఆర్వో భీమప్ప, సర్వే అధికారులు సోమవారం వివాదానికి కారణమైన పిల్ల కాలువను పరిశీలించారు. ఇరువర్గాల రైతులను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. 329/2బీ సర్వే నంబర్‌కు బీటీపీ నీటి వాటా హక్కుగా రికార్డుల్లో స్థిరీకరించారు. పక్క పొలం రైతులు బీ రామాంజనేయులు, బీ శ్రీనివాసులు కాలువ పునరుద్ధరణ విషయంపై అటకాయిస్తూ వచ్చారు. బాధిత రైతు ఈ లక్ష్మిదేవి అధికారులను ఆశ్రయించారు. సర్పంచ్, గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురికీ సర్దిచెప్పి రికార్డుల మేరకు కాలువ తవ్వకానికి డిప్యూటీ తహసీల్దార్ కృషి చేశారు. బీటీపీ ఆయకట్టులో రైతులంతా సమన్వయంతో నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేమ్ బోర్డులు పెట్టకపోతే ఎలా?


సామాజిక తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న డీఆర్పీ

కణేకల్లు: ప్రతి పని వద్ద నేమ్ బోర్డులు తప్పక పెట్టాలి... నేమ్ బోర్డులు పెట్టకపోతే ఎలా? అని ప్రొసీడింగ్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి ఉపాధి సిబ్బందిపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పీఓతోపాటు డీవీఓ రమణారెడ్డి, ఏపీడీ జయకుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఆర్‌పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఎస్‌ఆర్‌పీ మాట్లాడుతూ 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ ఉపాధి పథకం కింద చేపట్టిన రూ.13 కోట్ల పనులపై డీఆర్పీలు సామాజిక తనిఖీ చేశారన్నారు. పనులు చేసిన చాలా చోట్ల నేమ్ బోర్డులు లేవన్నారు. ఏపీఓ తిరుపాల్ స్పందిస్తూ వర్షాల కారణంగా నేమ్‌బోర్డులు తరలించలేకపోయామని, వారంలోపు ఏర్పాటు చేస్తామన్నారు. మస్టర్లలో పని కొలతలు, పని పేరు తదితర వివరాలు తప్పులుగా నమోదు చేస్తున్నారని, వర్క్ ఫైల్స్ సరిగా రెడీ చేయడంపై పీఓ అసహనం వ్యక్తం చేశారు. ఆడిట్‌లో చిన్న పొరబాట్లతో జరిగిన చెల్లింపులను గుర్తించిన అధికారులు రూ.13,628 రికవరీ చేయాలని ఆదేశించారు. రికార్డులను అస్తవ్యస్థంగా నిర్వర్తించడంతో సిబ్బందికి రూ.11వేలు పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు నరసింహాచారి, సోమన్నగౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుసిద్ధావధూతల రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని వెలిగొండలో గురుసిద్ధావధూతల రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గురుసిద్ధావధూతల స్వామి, భగళాముఖి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేకు వైస్ ఎంపీపీ నరసింహులు, నాగప్ప, సర్పంచ్ వీరాంజినేయులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శ్రీగురుసిద్ధావధూతల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, చెన్నకేశవులు, లాలు, సిద్ధప్ప, చెన్నరాయుడు, శంకరప్ప, శివ, ఎర్రిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రయాణం ఇక సాఫీగా..

నాడు


గతంలో రోడ్డు దుస్థితి

నేడు


పూర్తయిన సిమెంట్ రోడ్డు

రాయదుర్గం: కణేకల్లు మండలంలోని గణిగేరవాసులు దశాబ్దాలుగా రోడ్డు ముఖమే ఎరుగరంటే అతిశయోక్తి లేదు. గత టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న కాలవ గ్రామానికి వెళ్లగా.. ఆ పార్టీ నాయకులతో పాటు స్థానికులు క్రేన్ ద్వారా పెద్ద గజమాలతో ఆహ్వానం పలికారు. అయ్యా..? మాకు ఏం చేయక పోయినా పర్వాలేదు.. ఊరికి రోడ్డేయించాలని ప్రాధేయపడ్డారు. అవి విన్నపాలుగానే మిగిలాయి. ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా నరక ప్రయాణం మాత్రం తప్పలేదు. ఇటీవల గ్రామ పర్యటనకు వెళ్లిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి సమస్యను వివరించారు. సత్వరం స్పందించిన విప్ రూ.1.09 కోట్ల నిధులను మంజూరు చేయించారు. 1.50 కిలోమీటర్ల ప్రధాన దారిలో శాశ్వతంగా సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేయించేలా కృషి చేశారు. దీంతో గ్రామస్తులు విప్ కాపుతో పాటు సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజుల దేవర ఉత్సవాలు ప్రారంభం

గుమ్మఘట్ట: మండలంలో అడిగుప్ప గ్రామంలో ప్రసిద్ధిగాంచిన రాజుల దేవర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్వామి ఉత్సవ విగ్రహాన్ని వేపులపర్తి క్రాస్ వద్ద ఉన్న వేదావతి హగరికి జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగాజలంతో శాస్త్రోక్తంగా అభిషేకించి, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని ఆలయంలో అధిష్టించారు. మంగళవారం గ్రామస్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

మండల సమావేశం రేపు

గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యుడు, కో ఆప్షన్ సభ్యులు ,అధికారులు హాజరు కావాలన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం రేపు

శెట్టూరు: మద్యం తరలింపు కేసుల్లో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ యువరాజ్ సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ. 3,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు ఉమామహేశ్వరి సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

9 నుంచి శిక్షణ తరగతులు

బొమ్మనహాళ్: కణేకల్లులోని బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు గ్రామస్థాయి ఎస్‌ఏటీ నాయకుల స్వశక్తి కరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, బాలికలు వారి సమస్యల ఆత్మవిశ్వాసం కోసం నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు స్వశక్తి కరణ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఆర్డీటీ అధినేత మంచో ఫెర్రర్, ఆయన సతీమణి విశాలా ఫెర్రల్, రాయదుర్గం జుడీషియల్ కోర్టు న్యాయమూర్తి లావణ్య హాజరవుతారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది, సీఐటీయూ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం డిమాండ్లపై ఆర్డీఓ కార్యాలయ ఏఓ భూషణంకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయమ్మ, కొల్లమ్మ, లక్ష్మీ, వన్నమ్మ, మంజుల, కొల్లమ్మ, తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని పెంచాలి'

కూడేరు: ప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న పక్కా ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీపీఐ నేతలు సోమవారం కూడేరు తహసీల్దార్ కార్యాలం ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎస్‌డీటీ లక్ష్మీదేవికి అందజేశారు. పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మనోహర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, వ్యకాసం నాయకుడు రమణ, మండల కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సువార్త కూడిక'

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లిలో సోమవారం సువార్త కూడిక కార్యక్రమం నిర్వహించి ఏసు ప్రేమతత్వ భావాలను కళ్యాణదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు, సువార్తికుడు చల్లా కిషోర్ చౌదరి వివరించారు. స్థానిక పాస్టర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం 2023 క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సంతోష్, జాన్‌పాల్, సువార్తికులు సెలిన, ప్రెస్కిల్లా, అరుణ, ద్యాని తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి పని దినాలను పెంచాలి'

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని దినాలకు 100 నుంచి 150 రోజులకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణమూర్తి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కూడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎనిమిది వారాలుగా బిల్లులు మంజూరు కాక ఉపాధి కూలీలకు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎస్‌డీటీకి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఈరప్ప, కరీం, రాము, నాగరాజు, ధనుంజయ్య, శివ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల వితరణ


ఆలయ కమిటీకి చెక్కు అందజేస్తున్న దృశ్యం

కుందుర్పి: బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి అప్పిలేపల్లి గ్రామానికి చెందిన ర్యాగడి సురేష్, నగేష్ సోమవారం రూ.50 వేల నగదును ఆలయ కమిటీకి అందజేశారు. కాగా అర్ధరాత్రి జరిగిన రథోత్సవానికి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో భాగంగా సోమవారం పానకం బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, ఆలయ కమిటీ చైర్మన్ మల్లికార్జున, సభ్యులు జయచంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

బెళుగుప్ప: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ దుద్దేకుంట రామాంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని దుద్దేకుంట, గంగవరం తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, దొణ తిమ్మారెడ్డి, హనుమంతరాయుడు, యోగేశ్వరరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వజ్రకరూరు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ ఎర్రిస్వామి సూచించారు. సోమవారం మండలంలోని పందికుంట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం క్రిష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ పక్కాగా చేపట్టండి

బొమ్మనహాళ్: రబీ సీజన్‌లో ఈ–క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని వ్యవసాయాధికారులు శంకర్ రావునాయక్, అహమ్మద్‌బాషా సూచించారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ విధానాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ల ప్రకారం ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. పంట నమోదులో తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ యుగంధర్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా కార్యదర్శిగా భాస్కర్



రాయదుర్గంటౌన్: యాదవ సంఘం జిల్లా కార్యదర్శిగా రాయదుర్గానికి చెందిన జక్కుల భాస్కర్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప యాదవ్ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు భాస్కర్ తెలిపారు. సోమవారం పట్టణంలో యాదవ సంఘం అధ్యక్షుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ మేకల శ్రీనివాసులు, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు బంగి శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్ డిష్ గోవిందు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు గంగాధర్, తిమ్మరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు భాస్కర్‌ను సత్కరించారు.

ఆరోపణలు మానుకోవాలి

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసమే పని చేస్తోంది. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి నాయకత్వంలో గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం. దీన్ని చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు అర్ధరహిత ఆరోపణలు చేయడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమేష్ ఆరోపించారు. సోమవారం ఆయన బొమ్మనహాళ్‌లోని పాండురంగస్వామి దేవాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు పయ్యావుల మోహన్‌బాబు, అనిల్, సర్పంచ్ వన్నమ్మ, ఉప సర్పంచ్ హనుమంతప్ప చేసిన ఆరోపణలపై ఆయన మండి పడ్డారు. ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పాండురంగస్వామి దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ పంచాయతీ తీర్మాణాన్ని అడ్డుపెట్టుకొని దేవాలయ అభివృద్ధికి అడ్డు తగులుతున్నారని విమర్శించారు.